సాక్షి
సూర్యాపేట
శనివారం । 11 । మార్చి । 2023



బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి
పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. - 10లో



ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు
కేంద్రం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పోరాడుతుందని జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
35°/19°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమాజంలో మహిళలదే కీలకపాత్ర : ఎస్పీ



మహిళా సిబ్బందితో ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: సమాజాన్ని, ఇంటిని చక్క దిద్దడంలో మహిళలదే కీలక పాత్ర అని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీస్ సిబ్బందికి ఆయన బహుమతులు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది మహిళలు ఉద్యోగ బాధ్యతల్లో ధైర్యంగా విధులు నిర్వర్తిస్తూ ఆదర్శంగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, శ్రీనివాసరావు, శ్రీనివాస్, గోవిందరావు, నరసింహారావు, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్ర గౌడ్, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు గోదావరి జలాల పునరుద్ధరణ



71 డీబీఎం కాల్వకు వస్తున్న నీళ్లు

అర్వపల్లి: జిల్లాకు గోదావరి జలాలను శుక్రవారం పునరుద్ధరించారు. వారబందీ విధానంలో భాగంగా నీటిని వదిలారు. వారం రోజుల పాటు నీళ్లు వచ్చాక మళ్లీ నిలిపివేయనున్నారు. ప్రస్తుతం జిల్లాకు 1,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ నీటిని 69, 70, 71 మూడు డిస్ట్రిబ్యూటరీలకు పంపిణీ చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో గోదావరి జలాలను పెంచనున్నట్లు చెప్పారు. రైతులు ఈ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కోరారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టి స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవాన్ని నిర్వహించారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

బాలికలు రగ్బీ పోటీల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

మఠంపల్లి: బాలికలు రగ్బీ పోటీల్లో రాణించాలని జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్, మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మఠంపల్లిలోని వీవీ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలను స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ వినోద్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రగ్బీ క్రీడను విస్తృత పరిచేందుకు కోచ్‌లతో క్యాంపులు ఏర్పాటు చేసి ఆటలో మెళకువలు నేర్పిస్తున్నామని తెలిపారు. కాగా ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500మంది బాలికలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తరుణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాంరెడ్డి, జిల్లా సభ్యులు శేషు, శివ, సతీష్, సుమన్, వినోద్, శ్రీను, పీఈటీలు నాగమణి, రేణుక, వెంకటేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి, ముక్కంటి, నాగరాజు, నాగు పాల్గొన్నారు.

ఎత్తిపోతల మాకొద్దు

- ఎంబీసీ పేరుతో కొత్త లిఫ్ట్‌కు ప్రభుత్వం శ్రీకారం
- వెల్లటూరు వద్ద కృష్ణానది నుంచి ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్
- భూములు సేకరిస్తుండడంతో వ్యతిరేకిస్తున్న రైతులు
- మూడు మండలాల్లో ఆందోళనలు
- పాత లిఫ్ట్‌ను సక్రమంగా నడిపించాలని అధికారులకు విన్నపాలు



మేళ్లచెరువులో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

హుజూర్‌నగర్: నియోజకవర్గ పరిధిలోని చింతలపాలెం మండలం వెల్లటూరు వద్ద కృష్ణానదిపై కొత్తగా నిర్మించ తలపెట్టిన ఎంబీసీ (ముక్త్యాల బ్రాంచ్ కెనాల్) ఎత్తిపోతల పథకాన్ని (లిఫ్ట్‌ను) ఈ ప్రాంత రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ లిఫ్ట్ మాకు వద్దేవద్దంటున్నారు. దాదాపు రూ.1,450 కోట్లతో లిఫ్ట్ నిర్మించి హుజూర్‌నగర్ శివారులోని 23.4 కిలోమీటరు వద్ద కాలువలోకి నీటిని ఎత్తి పోసేందుకు ప్రభుత్వం దీనికి రూపకల్పన చేసింది. ఈ లిఫ్ట్ ద్వారా హుజూర్‌నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లోని దాదాపు 53 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ దీనివల్ల విలువైన తమ భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆయా మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

160 ఎకరాల భూమి అవసరం..
ఈ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన వెల్లటూరు నుంచి ముక్త్యాల బ్రాంచి కెనాల్ వరకు 2.5 మీటర్ల వ్యాసార్థం గల రెండు పైపులు వేసేందుకు దాదాపు 20 మీటర్ల వెడల్పున, 20 కిలోమీటర్ల పొడవున సుమారు 160 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ప్రస్తుతం మూడు మండలాల్లో అధికారులు భూసేకరణ కోసం సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం రైతుల నుంచి పట్టా భూమిని సేకరించే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తమ భూములు ఇవ్వమని బాధిత రైతులంతా అంటున్నారు.

రైతుల ఆందోళన బాట
నూతనంగా చేపట్టబోయే ఎంబీసీ లిఫ్ట్ వద్దంటూ రైతులు ఆందోళనకు దిగారు. ఆందోళనలో భాగంగా ఫిబ్రవరి 13న హుజూర్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. మార్చి 4న చింతలపాలెంలో రైతులు భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్‌కు మెమొరాండం ఇచ్చారు. తాజాగా మాకు లిఫ్ట్ వద్దంటూ మేళ్లచెరువులో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. లిఫ్ట్ పేరుతో ప్రభుత్వం మా భూములను సేకరిస్తే జీవనాధారం కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో సేకరించే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాదని ప్రభుత్వం మొండికేస్తే ఆందోళనలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని రైతులు పేర్కొంటున్నారు.

కాలువల్లో పూడిక తీయిస్తే సరి..
ఈ లిఫ్ట్ నిర్మాణం వల్ల తమకు నష్టం జరిగే ప్రమాదం ఉందని, చింతలపాలెం మండలం వెల్లటూరు వద్ద మనుగడలో ఉన్న లిఫ్ట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తే ఎవరికీ నష్టం ఉండదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎన్ఎస్‌పీ కాలువ ద్వారా తమ భూములకు సాగునీరు అందుతుందని..అవసరమైతే సాగర్ కాలువల్లో పూడిక తీసి చివరి భూములకు సాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చింతలపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

మా భూములు లాక్కోవద్దు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలం వెల్లటూరులోని పులిచింతల బ్యాక్ వాటర్‌ను హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం వద్దకు తరలించేందు నిర్మించతలపెట్టిన లిఫ్ట్ పైప్‌లైన్ కోసం మా భూములు లాక్కోవద్దని మేళ్లచెరువు మండల రైతులు కోరారు. కొత్త లిఫ్ట్ పైప్‌లైన్ వద్దని బాధిత రైతులు శుక్రవారం మేళ్లచెరువులో రోడ్డుపై ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దార్ దామోదర్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడుతూ తమ అనుమతి లేకుండా సర్వే చేసి మా భూములను లాక్కోవాలని చూస్తే ఊరుకోబోమన్నారు. మండలంలో సుమారు 80 ఎకరాలు భూమిని బాధిత రైతులు కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ, కలెక్టర్‌కు తమ గోడు విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

జీవనాధారం కోల్పోతాం..



లిఫ్ట్ నిర్మాణానికి మా భూములు సేకరిస్తే జీవనాధారం కోల్పోతాం. దీనివల్ల వ్యవసాయం చేసుకునే వారికి కోలుకోలేని దెబ్బ తలుగుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామంటే అప్పుడు రైతులు ఆలోచిస్తారు.
– వట్రా వెంకటరెడ్డి, రైతు, వేపలసింగారం, హుజూర్‌నగర్ మండలం

ఉన్నది నడిపితే చాలు



ప్రస్తుతం వెల్లటూరు వద్ద లిఫ్ట్ ఉన్నది. కొన్ని కారణాల వల్ల అది నడవడం లేదు. ఆ లిఫ్ట్ నడిపితే చాలు ఈ ప్రాంతానికి మరో లిఫ్ట్ అవసరం లేదు. పాతదాన్ని నడపకుండా కొత్త లిఫ్ట్ కోసం భూములు ఇవ్వాలంటే రైతులు ఎలా ఇస్తారు.
– యర్రం లక్ష్మారెడ్డి, రైతు, మల్లారెడ్డి గూడెం, చింతలపాలెం మండలం

లిఫ్ట్ నిర్మించడం వల్ల రైతులకు మేలు



లిఫ్ట్ నిర్మించడం వల్ల పంట పొలాలకు సాగునీటి ఇబ్బంది ఉండదు. రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కాబట్టి రైతులు ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలి. ఈ విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.
– వెంకారెడ్డి, ఆర్డీఓ, హుజూర్‌నగర్

ఇంటర్ పరీక్షలకు 33 కేంద్రాలు

- 15 నుంచి ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్న ఎగ్జామ్స్
- అరగంట ముందే సెంటర్లకు చేరుకోవాలి
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం
- డీఐఈఓ జానపాటి కృష్ణయ్య



మాట్లాడుతున్న డీఐఈఓ జానపాటి కృష్ణయ్య

సూర్యాపేట టౌన్: ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి (డీఐఈఓ) జానపాటి కృష్ణయ్య అన్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారని శుక్రవారం ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. పరీక్షలకు సంబంధించి పలు విషయాలను ఆయన మాటల్లోనే..

హాజరు కానున్న 16,930 మంది విద్యార్థులు
జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు 73 ఉన్నాయి. వీటిలో 16,930 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,727 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,089 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులు 1,715 మంది, ద్వితీయ విద్యార్థులు 1,399 మంది పరీక్షలు రాయనున్నారు. వీరికి జిల్లావ్యాప్తంగా మొత్తం 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.

సీసీ కెమెరాల నిఘాలో..
ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు కొనసాగుతాయి. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించాం. పరీక్షలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మూడు సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరిటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించాం. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు ఎక్కడంటే..
సూర్యాపేటలో 13 సెంటర్లు, కోదాడలో ఏడు, తుంగతుర్తిలో మూడు, హుజూర్‌నగర్‌లో రెండు, మఠంపల్లిలో ఒకటి, నెమ్మికల్‌లో రెండు, తిరుమలగిరిలో రెండు, నడిగూడెంలో 2 సెంటర్ల చొప్పున ఏర్పాటు చేశాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని వసతులు ఉన్నా సెంటర్లనే కేటాయించాం.

హాల్ టికెట్లు ఇవ్వకుంటే చర్యలు
ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల సమయంలో ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని ఒత్తిడి చేయొద్దు. విద్యార్థుల ఫిర్యాదు ఆధారంగా ఆయా కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లో హాల్ టికెట్‌లు ఇవ్వకుండా ఆపొద్దు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి
విద్యార్థులు ఈ నెల 15న మొదటి, 16న ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. విద్యార్థులు ఒత్తిడి, భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. అనుమానాలుంటే అధ్యాపకులను సంప్రదించాలి. పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. రానున్న వారం రోజులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలి.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

సూర్యాపేట టౌన్: 15వ తేదీ నుంచి జరగబోయే ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ జానపాటి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీఐఈఓ కార్యాలయంలో సీఎస్, డీఓ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లతో ఇంటర్ పరీక్షలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఎలాంటి పొరపాట్లు జరిగిన కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు ఎం.సోమయ్య జి.లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, రాకెండ్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కలెక్టర్ వెంకట్రావు

మోతె: ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.వెంకట్రావు హెచ్చరించారు. శుక్రవారం మోతెతోపాటు పలు గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి, పెండింగ్ స్లాట్ బుకింగ్ వంటి పలు అంశాల గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. మోతెలో పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందించే వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో కంటి వెలుగు, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశిఅంచారు. కంటి వెలుగు కార్యక్రమంలో డాక్టర్‌తో పాటు ఆరోగ్య సిబ్బంది ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ హరిసింగ్‌నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



విభళాపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

పారదర్శకంగా పథకాలు అమలు



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు జరుగుతున్నాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ అన్నారు. జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు వచ్చిన ఐఎస్ఎస్, ఐఈఎస్ ట్రైనీ అధికారుల బృంద సభ్యుల పర్యటన ముగింపు సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు మోహన్‌రావుతో కలిసి సమావేశమై పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం బృంద సభ్యులు జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు అద్భుతంగా ఉందని, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రక్రియ ఒకమైలు రాయిగా నిలుస్తుందని తమ అభిప్రాయాలను తెలిపారు. అనంతరం బృందం సభ్యులకు మెమెంటోలు అందజేసి సత్కరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీపీఓ యాదయ్య, ఐసీడీఎస్ పీడీ జ్యోతి పద్మ, డీఏఓ రామారావునాయక్, సీపీఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పిల్లలమర్రి దేవాలయం ఎదుట ట్రైనీ ఐఏఎస్, ఐఈఎస్ అధికారుల బృందం

పిల్లలమర్రి శివాలయాల సందర్శన
సూర్యాపేట రూరల్: మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి చారిత్రాత్మక శివాలయాలను ట్రైనీ ఐఎస్ఎస్, ఐఈఎస్ ట్రైనీ అధికారుల బృందం సభ్యులు సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మునగలేటి సంతోష్‌శర్మ ఆశీర్వచనం చేశారు. వారి వెంట జెడ్పీ సీఈఓ సురేష్, సిబ్బంది ఉన్నారు.

హాజరు శాతం పెంచాలి

హుజూర్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురం ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలకు హాజరు కాకపోడంపై హెచ్ఎం యాదగిరిరెడ్డిని మందలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి నుంచి విద్యార్థులంతా పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యం భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాల వంట గదితో పాటు విద్యార్థులకు వండిన భోజనాన్ని, రేషన్ షాపును పరిశీలించారు. ఆయన వెంట డీటీ సంధ్యారాణి, ఆర్ఐ షరీఫ్, ఉపాధ్యాయులు, రేషన్ డీలర్ రాగం లింగయ్య తదితరులు ఉన్నారు.

రికార్డుల పరిశీలన
హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో రికార్డులు, హాజరు పట్టికలు, ధరణి, ఇతర ఫైళ్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

పెన్‌పహాడ్: ఇంటింటికీ తిరిగి తడి పొడి చెత్తను సేకరిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీపీఓ యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చినగారకుంటతండాలో నర్సరీ, పంచాయతీ, శ్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి మాట్లాడారు. మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పోయాలన్నారు. పంచాయతీ ఆఫీస్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాలిబాయి, ఈఈ భద్రునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ జానయ్య, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.



మొక్కకు నీళ్లు పోస్తున్న డీపీఓ యాదయ్య

జ్వరం బారిన జనం

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు
- వాతావరణంలో మార్పులే కారణం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ రాయించుకుంటున్న రోగులు



జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

తిరుమలగిరి(తుంగతుర్తి): ఇటీవల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జనం జ్వరం బారిన పడుతున్నారు. మూడు రోజులుగా తగ్గని జ్వరం, దగ్గుకు తోడుగా శ్వాస సమస్యలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కోవిడ్ వైరస్‌తో సుదీర్ఘ పోరాటం చేసిన ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటుండగా అవే లక్షణాలతో వస్తున్న జబ్బులు ప్రజలను భయాందోళన కలిగిస్తున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వర సంబంధిత లక్షణాలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా అస్తమా రోగులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న జ్వర పీడితులు
ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఫ్లూ జ్వరాలు పంజా విప్పుతున్నాయి. దీంతో ప్రతి ఇంటో జ్వరపీడితులే కనిపిస్తున్నారు. దీంతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. పీహెచ్‌సీల్లో ప్రతిరోజూ 40 నుంచి 50 మంది వరకు ఔట్ పేషంట్లు వైద్యం కోసం వస్తుంటే అందులో పది నుంచి ఇరవై మంది వరకు జ్వర పీడితులు ఉంటుండడం గమనార్హం. అలాగే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో రోజుకు 500 మంది ఔట్‌పేషంట్లు వస్తుంటే అందులో పదిశాతం మంది జ్వరం, దగ్గు, వాంతులు, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలతో బాధపడే వారే ఉంటున్నారని సిబ్బంది చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా ఇన్‌ఫ్లూయెంజా, హెచ్3 ఎన్2 వైరస్ కేసులు పెరుగుతుండడంతో జాగ్రత్తగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు ఫ్లూ నిర్ధారణ కానప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

వేసవి మొదలు కావడంతో..
చలికాలం పోయి వేసవి మొదలు కావడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో జ్వరంతో పాటు దగ్గు, వికారం, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, కొన్ని సందర్భాల్లో అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇన్‌ఫెక్షన్ 5 నుంచి 7 రోజుల పాటు ఉంటుంది. జ్వరం మూడు నుంచి నాలుగు రోజుల్లో తగ్గుతుండగా దగ్గు, ఇతర ఒళ్లు నొప్పులు మాత్రం వారం రోజుల వరకు ఉంటున్నాయని ఇటు రోగులు, అటు వైద్యులు చెబుతున్నారు.

ఆందోళన చెందొద్దు



జ్వరం, జలుబు, దగ్గు, శ్వాస కోశ సమస్యలతో వచ్చే వారికి అవసరమైన వారికి పరీక్షలు చేయించి రోగ నిర్ధారణ మేరకు వైద్యం చేస్తున్నాం. వాతావరణంలో వచ్చిన మార్పులతో కేసులు ఎక్కువయ్యాయి. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి.
– డాక్టర్ కోటాచలం, జిల్లా వైద్యాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు
- ఎండ వేడిమికి బయటకు వెళ్లవద్దు.
- చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- జన సంచారం వద్దకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలి.
- ముక్కు, నోరుకు దగ్గరగా చేతులు తీసుకెళ్లడానికి జాగ్రత్తలు తీసుకోవాలి.
- ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలి.
- యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడొద్దు.
- జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస కోశ సమస్యలతో బాధపడుతుంటే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

క్లుప్తంగా

అవమానపరిచారని ఫిర్యాదు

కోదాడ: కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌పై కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రథమ పౌరురాలిగా, కోదాడ ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా ఉన్న తనకు ఈనెల 8న మహిళా దినోత్సవం రోజునే తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజు వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం చేశారని కానీ దీనికి సంబంధించి కనీస సమాచారం ఇవ్వలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాము కాటుతో రైతు మృతి


వీరయ్య (ఫైల్)

అర్వపల్లి: పాము కాటుతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జాజిరెడ్డిగూడెంనకు చెందిన రైతు, మత్స్య కార్మికుడు గీస వీరయ్య(52) శుక్రవారం పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పాము కాటు వేసింది. చికిత్సకోసం తీసుకెళ్లేలోపే మరణించినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా మృతునికి జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, టీఎంపీఎస్ చైర్మన్ ఈదునూరి సంతోష్‌ముదిరాజ్, మూసీ మత్స్య సంఘం మాజీ చైర్మన్ సాదుల నర్సయ్య, ఇటుకులపహాడ్ సర్పంచ్ అల్లి సైదులు, రైతుబంధు సమితి అధ్యక్షుడు మామిడి సత్యనారాయణ, మామిడి విజయ్, సురేష్ తదితరులు నివాళులర్పించారు.

27నుంచి లక్ష్మీనారాయణ మహా యజ్ఞం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రసన్న కృష్ణదాస్

యాదగిరిగుట్ట : ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల ఏప్రిల్ 23వ తేదీ వరకు యాదగిరిగుట్ట పట్టణంలోని శుభోదయ గార్డెన్స్‌లో అఖండ నామ ఆశ్రమం ఆధ్వర్యంలో అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు అఖండ నామ ఆశ్రమ పీఠాధిపతి, అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ యజ్ఞ సమతి చీఫ్ కో ఆర్డినేటర్ ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ వెల్లడించారు. అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహా యజ్ఞంకు సంబంధించిన పూజల వివరాలతో కోరిన కరపత్రాలు, బుక్‌లెట్‌కు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఆలయ సన్నిధిలో ఆవిష్కరించారు. 27వ తేదీన శ్రీకృష్ణ గాయత్రి హవనముతో ప్రారంభమైన మహా యజ్ఞం ఏప్రిల్ 23వ తేదీన అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ హవనం, పూర్ణాహుతితో ముగుస్తుందన్నారు. ఈ మహా యజ్ఞంలో 1000 మంది జీయర్లు, పీఠాధిపతులు, స్వామిజీలు, ధర్మకర్తలు పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అఖండ నామ ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

పెద్దవూర : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. పెద్దవూర, తిర్మలగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బాణావత్ వరుణ్ అలియాస్ బన్నీ(17), ఇంద్రకంటి సుమంత్(18)లు హైదరాబాద్‌లో ఉంటున్నారు. తమ స్నేహితుని వివాహానికి హాజరుకావటానికి శుక్రవారం స్కూటీపై తమ స్వగ్రామమైన నర్సింహులగూడేనికి వస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రం సమీపంలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్ సమీపంలోని బస్ బే వద్దకు రాగానే అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో స్కూటీ వెనక కూర్చున్న బాణావత్ వరుణ్ రోడ్డుపై పడటంతో తలఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీని నడుపుతున్న ఇంద్రకంటి సుమంత్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుమంత్ మృతి చెందాడు. కాగా మృతులు వరుణ్ హైదరాబాద్‌లో డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా, సుమంత్ హైదరాబాద్‌లోనే ఐటీఐ చదువుతున్నాడు. గత మూడు సంవత్సరాల క్రితం సుమంత్ తండ్రి ప్రసాద్, పది సంవత్సరాల క్రితం వరుణ్ తండ్రి భాస్కర్ సైతం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సింగం రామ్మూర్తి తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూటీ


వరుణ్ (ఫైల్)


సుమంత్ (ఫైల్)

బైక్ ఢీకొని..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన మిట్టపల్లి రాంబాబు (40) వృత్తి రీత్యా మండలంలోని డొక్కల బావితండాలో కిరాణ దుఖాణం నడుపుతున్నాడు. రోజు వారి లాగానే గురువారం కూడా డొక్కలబావితండాకు వెళ్లి రాత్రి తిరిగి రాంబాబు అతని అన్న సుదర్శ ఇంటికి వస్తుండగా మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస పంక్షన్‌హాల్ వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో అతివేగంతో వస్తున్న పల్సర్ బైక్ రాంబాబు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతోరాంబాబు అతని అన్న సుదర్శన్ కింద పడిపోయారు. రాంబాబు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం హాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని అన్న సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ బాబు తెలిపారు.

నర్సింహులగూడెంలో విషాదఛాయలు

నిడమనూరు: మండలంలోని నర్సింహులగూడేనికి చెందిన ఇంద్రగంటి సుమన్ గౌడ్ (18), బానోతు వరుణ్ (బన్నీ)(17)లు శుక్రవారం పెద్దవూర మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విశాదఛాయలు నెలకొన్నాయి. నర్సింహులగూడెంలో శుక్రవారం జరిగే వివాహానికి హైదరాబాద్ నుంచి వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాంలో ఇద్దరూ మృతి చెందారు. ఇంద్రగంటి సుమన్ తండ్రి ప్రసాద్ డ్రైవర్‌గా జీవనం గడుపుతూ అనారోగ్యంతో 2021 ఏప్రిల్‌లో మృతి చెందాడు. సుమన్ సోదరుడు వంశీతో కలిసి తల్లి సరస్వతితో పాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సుమన్ అక్కడే డిగ్రీ చదువుతున్నాడు. బానావత్ వరుణ్ (బన్నీ) తండ్రి బానావత్ భాస్కర్ గత 12 సంవత్సరా క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి భాస్కర్ భార్య నర్సింహులగూడెం నుంచి రోజూ హాలియాకు వెళ్లి అక్కడ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోసించుకుంటూ వస్తున్నది. వరుణ్‌కు కూడా సోదరుడు ఒకరు ఉన్నాడు. ఇద్దరి ఇండ్లూ 50మీటర్ల దూరంలోనే ఉండడం, ఇద్దరూ స్నేహితులు కావడంతో కలిసి మెలిసి తిరిగేవారు.

ఎంచుకున్న రంగంలో పోరాడి పైకిరావాలి


నివేదిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న హై కోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

బీబీనగర్ : ఎయిమ్స్ విద్యార్థులు ఎలాంటి వేధింపులకు, మనస్తాపాలకు గురి కాకుండా తాము ఎంచుకున్న రంగంలో పోరాడి పైకి రావాలని హై కోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్ సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మూడవ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న చిన్న చిన్న సంఘటనలకు జీవతంలో జరిగే కష్టాలకు తరుచూ ఆవేదనకు గురికాకుండా మారుతున్న ఆధునిక కాలంలో ఆయా రంగాల్లో ఉండే విధానాల(సిస్టం)తో పోరాడాలని పిలుపునిచ్చారు. మెడికల్ విద్యార్థులు కళాశాలలో ఎలాంటి సంఘటనలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణంతో మెలిగి మంచి ఫలితాలను సాధించాలన్నారు. ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ వైద్య కళాశాలలపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని దానిని వమ్ము చేయకుండా ఫ్యాకల్టీ వైద్యులు, మెడికల్ విద్యార్థులు దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో గల ఎయిమ్స్ నంబర్ 1గా నిలిచేలా అందరూ కృషి చేయాలన్నారు.

నేను యాదాద్రి భువనగిరి జిల్లా వాసినే..

తాను యాదాద్రిభువనగిరి జిల్లా వాసినే అని జడ్జి తెలిపారు. తమది వలిగొండ మండలం గోకారం గ్రామమని తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాను ఎంతో కష్టపడి పైకి ఎదిగానని చెప్పారు. తన కూతురు కూడా ఎంబీబీఎస్ చదుతోందని, సమాజానికి ఉపయోగపడే వైద్యులపై ఉన్న అభిమానంతో చదివిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్‌భాటియా, డీఎస్ రాహుల్ నారాణ్, మెడికల్ సూపరింటెండెంట్ నీరజ్ అగర్వాల్, వైద్య బృందం పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చివ్వెంల(సూర్యాపేట) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కోమటి కుంట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోమటి కుంట గ్రామ శివారులో ఉన్నటువంటి గుట్ట పక్కన్న పలువురు పేకాట అడుతున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఒక్కసారిగా దాడి చేశారు. దీంతో సంఘటన స్థలంలో రూ. 59 వేల నగదు. 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని ఆదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

నాలుగు రోజులు ఇంట్లోనే మృతదేహం


శ్రీను (ఫైల్)

కేతేపల్లి : కుటుంబ తగాదాలతో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహానికి నాలుగు రోజుల తర్వాత అంత్యక్రియలు నిర్వహించారు. ఈసంఘటన కేతేపల్లి మండలంలోని తుంగతుర్తిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన గునగంటి శ్రీను(37) మాడ్గులపల్లి మండలం పాములపహాడ్‌లో రైస్ మిల్లును కొనుగోలు చేసి కుటుంబంతో సహా ఏడేళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఆస్తి పంపకాల విషయంలో కుటుంబ సభ్యులతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 6న పాములపాడుకు వెళ్లిన తల్లిదండ్రులు, సోదరుడు శ్రీనుతో గొడవపడ్డారు. ఈక్రమంలో శ్రీనుపై దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను అదే రోజు సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఈనెల 6న రాత్రి శ్రీను మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. అయితే శ్రీను మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించటంతో పాటు, ఆస్తిని తన పిల్లల పేరిట రిజిస్టర్ చేయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీను భార్య తరుపు బంధువులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేది లేదని అడ్డుకున్నారు. శ్రీను మృతికి కారణమైన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నందున ఆస్తులు ప్రస్తుతం పిల్లల పేర రాయించేందుకు వీలు కాదని, అంత్యక్రియల నిర్వహించిన అనంతరం మాట్లాడుదామని చెప్పినా అంగీకరించ లేదు. చివరకు కుల పెద్దలు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో అంత్యక్రియలు నిర్వహించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నగేష్ మృతదేహం


యర్రగోర్ల నగేష్ (ఫైల్)

త్రిపురారం : హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన యర్రగొర్ల నగేష్(27) గొర్రెలు కాసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీ ఉదయం నుంచి నగేష్ కనబడలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో నగేష్ సోదరుడు యర్రగొర్ల సతీష్ త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ నెల 7న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో అదే గ్రామానికి చెందిన కంచుగంట్ల శ్రీనివాస్ అదుపులోకి తీసుకొని విచారించడంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.

పక్కా ప్రణాళికతోనే..

అంజన పల్లి గ్రామానికి చెందిన యర్రగోర్ల నగేష్, కంచుగంట్ల శ్రీనివాస్‌లు గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కలిసి వారికి ఉన్న గొర్రెలు మేపడానికి ఇతర ప్రాంతాలకు సైతం వెళ్తున్నట్లు సమాచారం. అయితే యర్రగొర్ల నగేష్‌కు వివాహం కాలేదు. కంచుగంట్ల శ్రీనివాస్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో కంచుగంట్ల శ్రీనివాస్‌కు అనుమానం కలిగి నగేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. పక్కా ప్రణాళిక ప్రకారం శ్రీనివాస్ నగేష్‌ను తన ఇంటికి వచ్చేవిధంగా ప్లాన్ చేసుకున్నాడు. దీంతో రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన నగేష్‌ను శ్రీనివాస్ ఇంటిలో కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం పశువుల కొట్టం వద్ద ఉన్న సెప్టిక్ ట్యాంక్ మూత పగలగొట్టి నగేష్ మృతదేహాన్ని పడవేసినట్లు పోలీసులు సమక్షంలో కంచుగంట్ల శ్రీనివాస్ ఒప్పుకున్నాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం సీఐ గాంధీ నాయక్, ఆర్ఐ రూసీ్ ఆధ్వర్యంలో నగేష్ మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్ నుంచి బయటకు తీయించారు. మృతదేహం చుట్టు పాత వస్త్రాలు వేయడంతో కాస్త కుళ్లిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అంజనపల్లిలో భారీ బందోబస్తు

యువకుని హత్య జరగండంలో అంజన పల్లి గ్రామంలో సుమారు 50 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగేష్ మృతదేహాన్ని చూడడానికి గుంపులుగా వచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు గ్రామస్తులను చెదరగొట్టారు. దీంతో గ్రామంలో కాసేపు టెన్షన్ వాతావరణం నెకొంది. సెప్టిక్ ట్యాంక్‌లో యువకుని మృతదేహం దొరకడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

బీడు భూములు సస్యశ్యామలం

- దామరకుంట వద్ద గోదావరి జలాల విడుదల
- ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే సునీత

మర్కూక్(గజ్వేల్), తుర్కపల్లి : గోదావరి జలాలతో బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట రెగ్యులేటర్ కాలువలోకి కొండపోచమ్మసాగర్ నుంచి వారు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 30 వేల ఎకరాలు, ఆలేరు నియోజకవర్గంలో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తొమ్మిది స్టేషన్లు దాటి పదో స్టేషన్‌లో నీటిని విడుదల చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ నీటితో ఆలేరు నియోజకవర్గంలోని 20 చెరువులను నింపవచ్చనన్నారు. ప్రతి గుంట భూమికి సాగు జలాలు అందించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కృషితో 2020లోనే తుర్కపల్లి ప్రధాన కాల్వ అందుబాటులోకి వచ్చిందన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలు శివారు వెంకటాపూర్ వద్ద ప్రారంభమై దామరకుంట నుంచి ఆలేరులోని తుర్కపల్లి మండలంలో 14 గ్రామాల చెరువుల్లోకి చేరుతాయన్నారు. అక్కడి నుంచి చిన్న చిన్న కాలువల ద్వారా బొమ్మలరామారం మండలంలోని 14 చెరువులను నింపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రీబాల్‌నర్సయ్య, తుర్కపల్లి ఎంపీపీ భూక్య సుశీల, బొమ్మాల రామారం ఎంపీపీ సుధీర్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ల హామీలను విస్మరిస్తున్న కేంద్రం

యాదగిరిగుట్ట : చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల అంశం అనేక ఏళ్లుగా కోల్డ్ స్టోరేజీలో నానుతూనే ఉందని, ఎన్నికల సమయంలో జాతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సంబంధించి హామీలు ఇవ్వడం, ఆ తరువాత వాటిని తుంగలోతొక్కడం పరిపాటిగా మారిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై ప్రధాని నరేంద్రమోదీకి విప్ సునితామహేందర్‌రెడ్డి శుక్రవారం రెండు పేజీల లేఖను రాసి పంపించారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సైతం మహిళా రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని లేఖలో పేర్కొన్నారు. సంపూర్ణ మెజార్టీ ఉన్న బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి గానీ నిజంగా చిత్త శుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేయాలని, కేంద్రంలో ఉన్న బీజేపీకి ఇది పెద్ద సమస్య ఏమీ కాదన్నారు. మహిళా రిజర్వేషన్ సాధన కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి జాతీయ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఢిల్లీ వేదికగా దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈ దీక్షకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేకా రాష్ట్రాలకు చెందిన పార్టీలు, మహిళా సంఘాలతో పాటు మేధావులు సైతం మద్దతు ప్రకటించడంతో పెద్ద ఎత్తున దీక్ష విజయవంతం అయిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం కేసీఆర్ అనేక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తన పరిధిలో ఉన్న మహిళా రిజర్వేషన్ల అంశాన్ని వెంటనే పరిష్కరించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

చివ్వెంల(సూర్యాపేట) : వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. చివ్వెంల, పాలకవీడు మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామానికి చెందిన పర్వతం బ్రహ్మాచారి (26) వృత్తీ రీత్యా డాక్యుమెంటరీ రైటర్ల వద్ద పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం కొంతమంది వద్ద అప్పుచేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులకై ఎక్కువై ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు , మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని కార్మికుడు..

పాలకవీడు : ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని మహంకాళిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భవానీపురంలో గల డెక్కన్ సిమెంట్ పరిశ్రమ లేబర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిశ్వాస్(23) ఓ ప్రైవేటు సంస్థ ద్వారా డెక్కన్ పరిశ్రమలో కార్మికుడిగా పనికి చేరినట్లు తెలిపారు. రోజూ మాదిరిగా పనులకు వెళ్లాల్సిన బిశ్వాస్ కాలనీ సమీప ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. తోటి కార్మికులు గమనించి యాజమాన్యానికి తెలపడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలను విచారిస్తున్నారు. జీడీసీఎల్ ప్రైవేటు సంస్థకు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ ఇచ్చినే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై సైదులు వెల్లడించాడు.

బైక్ అదుపుతప్పి దంపతులకు గాయాలు


చికిత్స పొందుతున్న బాధితుడు

చివ్వెంల (సూర్యాపేట) : అదుపు తప్పి బైక్ బోల్తా పడటంతో భార్యభర్తలకు గాయలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని రోళ్లబంద తండ వద్ద శుక్రవారం సాయంత్ర జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట మండలం కాసరబాద గ్రామానికి సూర్యాపేట మండల ఆంధ్రజ్యోతి పత్రిక రిపోర్టర్ సాంబాచారి, ఆతని భార్య శైలజలు బైక్‌పై ఖమ్మం పట్టణంలో బందువుల ఇంట్లో శుభకార్యంకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో సూర్యాపేట–ఖమ్మం రహదారి రోళ్లబండ తండా వద్ద ముందుగా వెళ్తున్న కారు ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపు తప్పి కింద పడటంతో భార్య,భర్తలకు కాళ్లు.చేతులకు గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితులను ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న తాపీమేస్త్రీ మృతి


యాదయ్య మృతదేహం

కట్టంగూర్ : చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతిచెందాడు. ఈ ఘటన మండలకేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మ కాలనీకి చెందిన పాలడుగు యాదయ్య(50) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. అనారోగ్య సమస్యతో విసుగెత్తి గురువారం తన ఇంటి సమీపంలో ఉన్న కంపచెట్ల వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు యాదయ్యను 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాదుకు తీసుకెళ్లాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అదే రోజు రాత్రి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కూతురు అశ్విని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ డి. విజయ్‌కుమార్ తెలిపారు.

మిరప కోతలో మెళకువలు

- పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె.సందీప్‌కుమార్ సూచనలు

పాడి పంట


తెల్ల మిరప కాయలు వేరుచేస్తున్న కూలీలు


కె.సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

పెద్దవూర : మిరప పంటను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరప పంట ఇప్పుడిప్పుడే పండుగా మారుతుండటంతో రైతులు మిరప కాయలను కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఎండుమిర్చికి మార్కెట్‌లో క్వింటా రూ.20వేలకు పైగా అమ్ముడు పోతున్నాయి. మిరప కోత, ఆరబెట్టే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్‌కుమార్ తెలిపారు.

మిరప కోత, ఆరబెట్టే సమంయలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

మిరప రైతులు ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నా నాణ్యత లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన సమయంలో కోతలు కోయక, కల్లాల్లో వర్షానికి, మంచుకు కాయలు తడిస్తే నాణ్యత తగ్గుతుంది. మార్కెట్లో ధరలు లేక ఎగుమతులకు పనికిరాక, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతులు నష్ట పోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడం, విచక్షణారహితంగా పురుగు మందులను పిచికారీ చేయడం, పండిన మిరప కాయలు ఎప్పటికప్పుడు తెంచకపోవడం వంటి కారణాలతో కాయ నాణ్యత లోపిస్తుంది.

ఆరబెట్టడం ఇలా..

కొన్నిసార్లు కోతల సమయంలో వర్షాలు కురిస్తే సకాలంలో కోతలు జరగక కోసిన వాటిని సరైన సమయంలో ఎండబెట్టక పోవడంతో నాణ్యత లేని మిర్చిగా మారిపోతుంది. ఫలితంగా మార్కెట్లో కాయలకు సరైన ధర రాక నష్టపోవాల్సి వస్తుంది. మిరప కాయల్ని ఎండబెట్టే కల్లాల్ని గట్టి భూమి ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. దుమ్ము ఎక్కువగా లేని, కొద్దిగా ఏటవాలుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. నీళ్ల వెళ్లే వైపు కల్లం పొడవుగా ఉండాలి. వర్షం పడినప్పుడు పైనీళ్లు కల్లం పైకి రాకుండా కల్లం చుట్టూ అడుగున్నర ఎత్తు కట్ట ఏర్పాటు చేసుకోవాలి. తోట విస్తీర్ణం, దిగుబడిని బట్టి కల్లం పొడవు, వెడల్పులను తయారు చేసుకోవాలి. వర్షాలు పడ్డప్పుడు పరదాలు కప్పుతాం కాబట్టి నీరు తీసివేయడానికి అనుకూలంగా ఉంటుంది. దాదాపు 10 క్వింటాళ్ల మిరప 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు గల కల్లం తయారు చేసుకోవాలి. కల్లం సైజును బట్టి టార్పాలిన్ కవరు తెచ్చుకోవాలి. ప్రతిరోజు కోసే కాయల్ని కుప్పలుగా పోసి మరుసటి రోజు ఉదయం మంచు తగ్గగానే పలుచగా పోసి ఆరబెట్టాలి. ప్రతిరోజు సాయంత్రం ఆరబెట్టిన మిరప కాయల్ని కుప్పగా పోసి టార్పాలిన్ కవర్ కప్పి కాయలపై మంచు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఇలా చేస్తే గాలి, వెలుగురు బాగా ప్రసరించి కాయలు త్వరగా ఎండుతాయి. కాయలు బాగా ఎండక ముందే తెల్ల కాయలు వేరుచేయాలి. కాయల్లో 5 శాతం తేమ ఉన్నప్పుడే వాటిని మండె పోసి గోనె సంచులతో కప్పాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే రోజు ఉదయం శుభ్రమైన ఖాళీ సంచుల్లో వాటిని నింపాలి. ఒక్కో సంచిలో 40 కిలోల కాయల కన్నా ఎక్కువ నింపకూడదు. ఎక్కువ కాయల్ని సంచిలో తొక్కితే కాయ నాణ్యత చెడిపోయి మార్కెట్‌లో సరైన ధర రాదు. కోత సమయంలో ఈ విదమైన చర్యలు చేపడితే నాణ్యమైన పంటతో పాటు మార్కెట్లో అధిక ధర పలుకుతుంది.

కోత విధానం..

మిరపతోటలో కొన్ని కాయలు పండిన వెంటనే కూలీలతో కోస్తే, చెట్టు విరిగిపోయి తోటకు నష్టం కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. చాలా కాయలు పండిన తరువాత ఒకేసారి కోయవచ్చునని మరికొంత మంది రైతులు భావించి కోతను ఆలస్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆకాల వర్షాలు కురిస్తే పండిన కాయలు రాలిపోతాయి. మంచు వల్ల కూడా కాయలు రాలిపోయే అవకాశం ఉంది. ఒక్కోసారి తెల్లకాయలు ఎక్కువగా వస్తుంటాయి. మొక్కల ఎదుగుదల తగ్గుతుంది. అందువల్ల రైతులు తోటలో కోతకు వచ్చిన కాయల్ని విడతల వారీగా కోసి నాణ్యత గల కాయల్ని మార్కెట్‌కు పంపాలి. పండిన కాయల్ని వెంటనే కోస్తే తెల్లకాయలు ఎక్కువగా రావు. కాయకోత తరువాత ఎరువులు వేసి, నీటి తడి పెడితే అదనంగా మొక్కకు కాయ వచ్చి దిగుబడి పెరుగుతుంది. రైతులు కనీసం కాయలను ఆరు, ఏడు దఫాలుగా కోయాలి.